క్లుప్తంగా

మిర్యాలగూడ ఎంవీఐగా చంద్రశేఖర్



చంద్రశేఖర్

మిర్యాలగూడ: మిర్యాలగూడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాగర్ చెక్‌పోస్టులో ఎంవీఐగా పనిచేస్తున్న ఆయనను మిర్యాలగూడకు బదిలీ చేశారు. 2012 బ్యాచ్‌కు చెందిన చంద్రశేఖర్ తొలుత హైదరాబాద్, కోదాడ, నారాయణపేట, నిజామాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో ఎంవీఐగా పనిచేశారు. సంవత్సరంన్నర క్రితం నాగార్జునసాగర్ చెక్‌పోస్టు వద్ద ఎంవీఐగా పనిచేశారు.

రిజర్వేషన్లలో ఆటంకం కలగకుండా చూడాలి

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కోరుతూ బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రాగూడెంలో గల శ్రీకనకదుర్గ అమ్మవారి మండపంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు 60శాతం వరకు రిజర్వేషన్లు రావాల్సి ఉండగా బీసీలకు 42శాతం మాత్రమే అడుగుతున్నామని, కానీ కొంత మంది ఈ రిజర్వేషన్‌కు అడ్డుపడటం విడ్డూరంగా ఉందన్నారు.

వృత్తి విద్యతోనే మెరుగైన భవిష్యత్

అడవిదేవులపల్లి : విద్యార్థులకు వృత్తి విద్యతోనే మెరుగైన భవిష్యత్ ఉంటుందని అడవిదేవులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అజాహర్ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో వృత్తి విద్యపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక శిక్షణ ద్వారా ప్రథమ చికిత్స అందించడంతో పాటు వాటిలో సూత్రాలు, ల్యాబ్ వినియోగంతో పాటు మందులు తదితర వాటిపై శిక్షణ తీసుకున్నారు. కార్యక్రమంలో బొత్తలపాలెం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి, ఒకేషనల్ ట్రైనర్ దుర్గ తదితరులున్నారు.

సాగర్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాద స్థలం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన కృష్ణా నదిలోకి ఈతకు దిగిన పర్యాటకులు మృతి చెందుతున్న సంఘటనలు వరుసగా జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో సాగర్ సీఐ, ఎస్‌ఐలు ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. బుధవారం జలాశయం తీరంలో గల సమ్మక్క – సారక్క పుష్కరఘాట్, కృష్ణా తీరాన గల శివాలయ పుష్కరఘాట్, ఆంజనేయ పుష్కరఘాట్‌ను డీఎస్పీ సందర్శించారు. నది తీర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బారికేడ్లు, కంచె, పోలీసు పహారా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు భద్రతా నియమాలు పాటిస్తే ప్రాణనష్టం నివారించవచ్చని తెలిపారు. ఆయన వెంట సీఐ శ్రీను నాయక్, ఎస్‌ఐలు ముత్తయ్య, వీరశేఖర్, ప్రసాద్, తహసీల్దార్లు శ్యాంలాల్, అనీల్, డ్యాం భద్రతా అధికారి శ్రీనివాసరావు తదితరులున్నారు.

ముందే దసరా 'కిక్కు'

- ముందస్తుగా జాగ్రత్త పడుతున్న మద్యం ప్రియులు



వైన్ షాపు వద్ద మద్యం కొనుగోలు చేస్తున్న మద్యం ప్రియులు

హాలియా : గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలు బంద్ ఉండడం, అదే రోజు దసరా పండుగ వస్తుండడంతో మద్యం ప్రియులు మద్యాన్ని ముందే కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు. మరికొంత మంది దసరా తర్వాత రోజే పండుగ చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ సారి పండుగ రోజు గాంధీ జయంతి కావడంతో గిరాకీ తగ్గే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.

సాగర్ అందాలు తిలకిస్తూ..



నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద బుధవారం కృష్ణమ్మ సోయగాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

మహిషాసురమర్దినిగా అమ్మవారు



మిర్యాలగూడ అర్బన్ : పూజల్లో పాల్గొన్న మాలధారులు



మిర్యాలగూడ: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



హాలియా: అమ్మవారి వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెద్దవూర: కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

హాలియా : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు బుధవారం శ్రీ మహిషాసుర మర్ధినిదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు చేశారు. స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ స్థానాచార్యులు గోవర్ధనా రాఘవాచార్యులు నేతృత్వంలో అమ్మవారి వద్ద మహా పూర్ణాహుతి, మహా చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మనాది రవీందర్, రావుల వెంకటేశ్వర్లు, లకమాల లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

మండపం వద్ద కుంకుమార్చన

పెద్దవూర : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయం ఎదుట ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద బుధవారం రాత్రి కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసం ఉండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మహిషాసుర మర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహిషాసురమర్ధినిగా కనకదుర్గమ్మ

మిర్యాలగూడ అర్బన్: దుర్గాదేవి నవరాత్రి పూజల్లో భాగంగా బుధవారం కనకదుర్గ అమ్మవారు మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో చివరిరోజు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

అధిక కమీషన్ ఇస్తామని మోసం.. ఇద్దరి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న దేవరకొండ ఏఎస్పీ మౌనిక

డిండి: బ్యాంకులో ఉన్న బంగారాన్ని విడిపించి ఇస్తే అధిక కమీషన్ ఇస్తామని నమ్మించి మోసం చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను బుధవారం దేవరకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మౌనిక వెల్లడించారు. డిండి మండల పరిధిలోని హజ్యతండాకు చెందిన ఆంగోతు వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండల కేంద్రంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తన దగ్గరున్న బంగారం పెట్టి గోల్డ్ లోన్ తీసుకున్నాడు. ఇదిలా ఉండగా డిండి మండలంలోని చెర్కుపల్లికి చెందిన కాట్రావత్ సరిరామ్, దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన రమావత్ శ్రీరాములును వెంకటేష్ పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ తన పేరు మీద ఉన్న గోల్డ్ లోన్ కట్టి బంగారం విడిపించి ఇస్తే రూ.లక్షకు రోజుకు రూ. 3వేలు కమీషన్ ఇస్తానని సరిరామ్, శ్రీరాములుకు వెంకటేష్ చెప్పాడు. దీంతో గోల్డ్ లోన్ డబ్బులను సరిరామ్, శ్రీరాములు వేర్వేరుగా చెల్లించారు. కానీ రోజులు గడుస్తున్నా వీరిద్దరికి ఎలాంటి కమీషన్ డబ్బులు వెంకటేష్ ఇవ్వకపోవడంతో సరిరామ్, శ్రీరాములు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా వెంకటేష్‌తో పాటు ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ శ్రీకాంత్‌గౌడ్ కలిసి రూ.6,67,350 దుర్వినియోగం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.452000 నగదు, నకిలీ రశీదులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డిండి రూరల్ సీఐ బీసన్న, ఎస్‌ఐ బాలకృష్ణ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

అడవిదేవులపల్లి : మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో ఎస్సీలకు రిజర్వేషన్లు రాకపోవడంపై బుధవారం తహసీల్దార్ రాగ్యానాయక్‌కు దళితులు వినతిపత్రం అందజేశారు. మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు ఉండగా.. మొత్తం 14,074 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 1372 మంది ఎస్సీ ఓటర్లు ఉన్నారని, ఎస్సీలకు రిజర్వేషన్లలో అవకాశం కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. రెండు సర్పంచ్ స్థానాలు, ఒక ఎంపీటీసీ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించేలా పున:పరిశీలించాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాస్, పెద ముత్తయ్య, అంజిబాబు, ఆనంద్‌కుమార్, సైదులు, చిన భిక్షం, అనిల్, హరినారాయణ, లింగయ్య, మట్టయ్య తదితరులున్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి




క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

హాలియా : క్రీడలు యువకుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్ రెడ్డి భాను చందర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హాలియాలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.1 లక్ష, రెండవ బహుమతి రూ.70 వేలు, మూడో బహుమతి రూ.50వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, ఆంగోతు భగవాన్‌నాయక్, కాకునూరి నారాయణగౌడ్, వెంపటి శ్రీనివాస్, గడ్డంపల్లి వినయ్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కట్టెబోయిన అనిల్ కుమార్, మజహర్ మొహినుద్దీన్, గుర్రం అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

నాగార్జునసాగర్ : 55 ఏళ్ల నిండిన భవన నిర్మాణ కార్మికులకు ప్రతి నెలా రూ.9వేలు పెన్షన్ ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు షేక్ బషీర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పైలాన్ కాలనీలోని దొడ్డి కొమరయ్య భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రత్యేకంగా ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో వెల్ఫేర్ బోర్డు నుంచి రూ.6లక్షలు చెల్లించేవారని, దానిని రూ.పది లక్షలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గోవిందు, రోశయ్య పాల్గొన్నారు.

బుచ్చమ్మ మృతికి సంతాపం



బుచ్చమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు : కాంగ్రెస్ నాయకుడు వున్నం వెంకన్న, ఏజీపీ వున్నం చిన వీరయ్య మాతృమూర్తి వున్నం బుచ్చమ్మ వృద్ధాప్యంతో మృతి చెందారు. బుధవారం బుచ్చమ్మ మృతదేహాన్ని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వున్నం చినవీరయ్య, వెంకన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఎమ్మెల్సీ పరామర్శ..

ఏజీపీ వున్నం చినవీరయ్య మాతృమూర్తి వున్నం బుచ్చమ్మ మృతదేహానికి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మేరెడ్డి వెంకట్రాహుల్, మార్కెట్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


ఘనంగా తుల్జాభవాని పండుగ

పెద్దవూర: పెద్దవూర మండలంలోని పాల్తీతండా, తంగెళ్ల తండా, బాసోనిబావితండా, చింతపల్లితండా, మల్లెవానికుంటతండా, పూల్యాతండా తదితర తండాల్లో గిరిజనులు ఆరాధ్యదైవంగా భావించే తుల్జాభవాని పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. దసరా పండుగకు ముందు ఆయా తండాల గిరిజనులు మహారాష్ట్రలోని తుల్జాభవాని ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడికి నుంచి తండాలకు చేరుకున్న వారికి గిరిజన సంప్రదాయం ప్రకారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయా తండాల్లోని యువతులు సమీపంలోని కృష్ణా నది నుంచి పవిత్ర జలాలను బిందెలలో తీసుకొచ్చి అమ్మవారిని ప్రతిష్ఠించి అభిషేకం నిర్వహించారు.



పాల్తీతండాలో పెట్టెలను ఎత్తుకుని వస్తున్న గిరిజనులు


స్థానిక ఎన్నికల్లో రజకులకు ప్రాధాన్యం కల్పించాలి



మిర్యాలగూడలోని అమరువీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న బాసాని గిరి

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు ప్రాధాన్యత కల్పించాలని రజక సంఘం రాష్ట్ర నేత బాసాని గిరి డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడలోని తెలంగాణ అమరువీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డిలలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం సంతోషకరమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో రజకులకు అధిక ప్రాధాన్యం కల్పించాలన్నారు. నియోజకవర్గంలో రజకులు 15 వేల మంది ఉన్నారని, రజకుల దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. రజకులు బలంగా ఉన్న చోట్ల రజకులకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు జానపాటి రవి, యాదగిరి, దుర్గయ్య, శివ, అజయ్, నాగేశ్వర్‌రావు, సుధాకర్, ఎల్లయ్య, కోటేష్, నారాయణ, రాజు, రాము, సైదులు, మహేష్ తదితరులున్నారు.

తప్పిన ప్రమాదం



రోడ్డుకు అడ్డంగా పడిన స్తంభం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బుధవారం డీసీఎం రివర్స్ తీసుకుంటుండగా బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ స్తంభం రోడ్డుకు అడ్డంగా పడింది. ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాన్ని వెంటనే తొలగించారు.

మహిళా ఉద్యోగులకు వైద్య శిబిరం

నల్లగొండ: పోషణ మాసంలో భాగంగా బుధవారం నల్లగొండలోని ఎఫ్‌సీఐ కార్యాలయంలో ఆరోగ్యవంతమైన మహిళ–శక్తివంతమైన కుటుంబం పేరిట మహిళా ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మేనేజర్ సుధీన్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా కుటుంబాలు మరింత బలపడతాయని, తద్వారా సమాజం సుస్థిర అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ రివర్ నిమ్స్ ఆస్పత్రి వైద్యురాలు సౌమ్య పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కల్లెసెల్వి, కె.ఎస్.కె. ప్రసాద్, సంధ్య, స్పందన, సరిత, సునంద, భవ్య, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన డాక్టర్

- అతడితో పాటు మరొకరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ టూటౌన్ సీఐ సోమనర్సయ్య

మిర్యాలగూడ అర్బన్: సమాజంలో ఎంతో ఉన్నతమైన వైద్య వృత్తిలో ఉంటూ గంజాయితో పట్టుబడ్డాడు ఓ డాక్టర్. అతడితో పాటు అతడి స్నేహితుడిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ సోమనర్సయ్య విలేకరు సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా అగ్రహారం కెనాల్ రోడ్డుకు చెందిన దివాకరుని శ్రీనివాస పవన్‌కుమార్ ఉక్రెయిన్‌లో ఎంబీబీఎస్ చదివే రోజుల్లో మత్తు పదార్థాలకు అలవాటుపడ్డాడు. చదువు పూర్తిచేసుకుని ఇండియాకు వచ్చిన తర్వాత గంజాయికి అలవాటుపడి సేవించేవాడు. కొంతకాలంగా మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తూ స్థానికంగానే నివాసముంటున్నాడు. కొద్దిరోజుల క్రితం తన సొంతూరుకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చి ప్రతిరోజు సేవించేవాడు. తన సొంతూరికే చెందిన తన స్నేహితుడైన కనకాదండి హరిదత్త భరద్వాజ్‌ను మిర్యాలగూడకు రప్పించాడు. ఇద్దరు కలిసి బుధవారం స్కూటీలో గంజాయి పెట్టుకుని పట్టణ శివారులో సేవించేందుకు వెళ్తుండగా.. ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న టూటౌన్ పోలీసులకు తారసపడ్డారు. వారిని తనిఖీ చేయగా స్కూటీలో 110 గ్రాముల గంజాయి లభించింది. వారి నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ బి. రాంబాబు, ఏఎస్‌ఐ కె. చంద్రయ్య, కానిస్టేబుళ్లు ఎండీ అక్బర్ పాష, రామకృష్ణ, లక్ష్మయ్య, రాజశేఖర్, రామ్‌జీ పాల్గొన్నారు.

రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దు

- సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



నారాయణ్ అమిత్, సబ్ కలెక్టర్

మిర్యాలగూడ: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున మిర్యాలగూడ డివిజన్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉందని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఎవరూ రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లకూడదన్నారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద ఎంసీసీ టీమ్‌లతో తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందని ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల నియామవళిని ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించాలని ఎవరూ ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎలాంటి రాజకీయ సమావేశాలు, సభలు నిర్వహించవద్దని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేంతవరకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, డీఏఓ శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ కార్మికుల కూలి రేట్లు పెంపు

నల్లగొండ టౌన్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెయింటింగ్ కార్మికుల కూలి రేట్లు అక్టోబర్ 1 నుంచి పెంచామని, పట్టణంలోని బిల్డర్లు, ఇంటి యజమానులు సహకరించాలని సీఐటీయూ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు భీమనపల్లి శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో పనిచేస్తున్న పెయింటింగ్ కార్మికులందరూ యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవాలని, సంక్షేమ బోర్డు లేబర్ కార్డు తీసుకుని సంక్షేమ పథకాలు పొందాలని కోరారు.

'రీజినల్' అలైన్‌మెంట్ మార్చాలని వినతి

నల్లగొండ టూటౌన్: గట్టుప్పల్ మండలం తేరటుపల్లి గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డికి బుధవారం తేరటుపల్లి గ్రామ రైతులు వినతిపత్రం అందజేశారు. తేరటుపల్లిలో పట్టా భూములు కలిగిఉన్న తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మామిడి ప్రమీల, అచ్చిన మల్లయ్య, ఇస్టారి, పి.మారయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

నల్లగొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ పట్టణంలోని రివర్ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ సభ్యులు 10 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ వైస్ గవర్నర్ కోడె సతీష్, జోన్ చైర్‌పర్సన్ కర్నాటి విష్ణు, క్లబ్ అధ్యక్షుడు నిమ్మల పిచ్చయ్య, నోబుల్ అధ్యక్షుడు తంతెనపల్లి సైదులు, బుర్రి కృష్ణశేఖర్, యాస వెంకట్‌రెడ్డి, సులిగిరి నాగిరెడ్డి, రవీందర్ కొండేటి, ముల్క నాగిరెడ్డి, ముప్పిడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.